
సాక్షి
పల్నాడు
శనివారం । 24 । మే । 2025



ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాల పునఃపరిశీలనకు తెనాలిలోని జిల్లా వైద్యశాలలో ఏర్పాటైన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శుక్రవారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. లక్ష కుంకుమార్చనలో ఆలయ ఈఓ శీనా నాయక్ దంపతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కుట్ర

సర్వర్ పని చేయదు.. కూటమి కనికరించదు

కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఊరిస్తూ వచ్చిన కొత్త రేషన్‌కార్డుల మంజూరు, కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చినా ప్రజలకు చిక్కులు తప్పడం లేదు. దరఖాస్తు ప్రక్రియ తీవ్ర జాప్యంతో ఇబ్బందులెదుర్కొంటున్నారు. పౌరసరఫరాల శాఖ సర్వర్ మొరాయింపుతో గంటల కొద్దీ సచివాలయాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి.

- రేషన్ కార్డు దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్న సర్వర్
- దరఖాస్తుకు రెండు, మూడు రోజులు పని మానుకోవాల్సిందే
- ఒక సభ్యుడిని చేర్చాలని వెళితే కుటుంబం మొత్తం రావాల్సిందే అంటున్న సచివాలయ సిబ్బంది
- సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల మధ్య బయోమెట్రిక్‌కి అవకాశం
- చంటి బిడ్డలతో తల్లులు వేచి చూడాల్సిన దుస్థితి
- వాట్సాప్‌లో దరఖాస్తులకు అవకాశం అంటూ ప్రచారం
- వాట్సాప్ గవర్నెన్స్‌లో కనిపించని ఆప్షన్


సాక్షి, నరసరావుపేట : రేషన్ దరఖాస్తు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలంటే కనీసం రెండు మూడు గంటల పడుతోంది. తరువాత బయోమెట్రిక్ చేయించాలంటే సర్వర్ కోసం వేచి ఉండాల్సిందే. సాయంత్రం 5 గంటల నుంచి ఏడు గంటల మధ్య సర్వర్ పని చేస్తోందని ఆ సమయంలో రావాలని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లు చెబుతున్నారు. దీంతో చేసేదేమి లేక ఆ సమయంలో పడిగాపులు కాచి వేలిముద్రలు వేస్తున్నారు. ఆ రెండు గంటల సమయంలో కూడా మహా అయితే నాలుగైదు దరఖాస్తులే పూర్తి అవుతున్నాయి. రోజు పదుల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండగా పదిలోపే దరఖాస్తు ప్రక్రియ పూర్తి అవుతోంది. దీంతో ఒక్కో దరఖాస్తు దారుడు రెండు మూడు రోజులు పనిమానుకొని సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. చిన్నారులను కార్డులో చేర్చడానికి వెళ్లిన తల్లుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. చంటి బిడ్డలతో గంటల కొద్దీ వేచి ఉండటం ఇబ్బందిగా మారుతోంది.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌తో చిక్కులు...

హౌస్ హోల్డ్ డేటా ఎనేబుల్ చేయకపోవడంతో సమస్యలు అధికంగా వస్తున్నాయి. హౌస్‌హోల్డ్ సర్వేలో వివరాలను తొలగించడం, సవరించడం కుదరకపోవడంతో లబ్ధిదారులకు విపరీతమైన సమస్యలు తలెత్తుతున్నాయి. సర్వేలో మార్పులు చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తేనే ఈ సమస్య కొలిక్కివచ్చే అవకాశముంది. గతంలో జారీ చేసిన ఒకే తెల్లరేషన్ కార్డుపై రెండు రైస్‌కార్డులు ఉంటున్నాయి. ఈ రెండు కార్డులలోని సభ్యులంతా ఒకే హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉంటున్నారు. ఇప్పుడు ఆ కార్డులలో దేనిలోనైనా ఒక సభ్యుడిని చేర్చాలన్నా, తీసేయాలన్నా సాంకేతికంగా ఇబ్బంది అవుతోంది. సభ్యులంతా సచివాలయానికి వచ్చి వేలిముద్రలు వేయాలని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఎక్కడెక్కడో ఉన్న రెండు కార్డులలోని సభ్యులంతా సచివాలయానికి పరుగులు తీయాల్సి వస్తోంది. పోనీ వెంటనే పని జరిగిపోతుందా అంటే అదిలేదు. సర్వర్ మొరాంపుతో ఎప్పుడు ఓపెన్ అయితే అప్పటి వరకు వేచి ఉండాల్సిందే. ఇది ఒక్కోసారి రెండు మూడు రోజులు కూడా పడుతోంది. దీంతో వారంతా ఉద్యోగాలు, పనులకు సెలవుపెట్టి వేచి చూడాల్సి వస్తోంది.

వాట్సాప్ గవర్నెన్స్‌లో కనిపించని ఆప్షన్...

ప్రభుత్వ సేవలన్నీ సెల్‌ఫోన్‌లో పొందవచ్చని గొప్పలు చెప్పి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ సేవలు రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉపయోగపడటంలేదు. మే 15వ తేదీ నుంచి కార్డుదారులు 98823 00009 నెంబర్‌తో పని చేసే వాట్సాప్ గవర్నెన్స్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటనలు చేసింది. తీరా చూస్తే ఇప్పటికి వాట్సాప్ గవర్నెన్స్‌లో రేషన్ కార్డుల దరఖాస్తు, సభ్యుల చేర్పు వంటి ఆప్షన్లు కనిపించడం లేదు.



వాట్సాప్ గవర్నెన్స్‌లో కనిపించని రేషన్‌కార్డుల మంజూరు, మార్పులు, చేర్పుల ఆప్షన్

సమస్యలివే...

- రేషన్‌కార్డులో తప్పుగా నమోదైన కుటుంబ సభ్యుల సంబంధాలను సరి చేసుకోవాలన్నా, కార్డులోంచి తొలగించాలన్నా ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వలేదు.
- మార్పులు చేర్పులకు 15 సంవత్సరాల లోపు పిల్లలకు మాత్రమే అవకాశమిచ్చారు. 15 ఏళ్లకు మించిన పిల్లలను ఏదైనా కారణాలతో ఇప్పటివరకు లేనివారిని చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది.
- వివాహం చేసుకొని ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారిని కార్డులోంచి తొలగించేందుకు ఆప్షన్ ఇవ్వలేదు. కేవలం చనిపోయిన, ఇక్కడే పెళ్లి చేసుకొని వేరే కార్డులోకి బదిలీ చేస్తేమాత్రమే పేర్లు తొలగించే అవకాశముంది.
- కార్డులో ఆధార్ మ్యాపింగ్ తప్పుగా అయితే దాన్ని సరిచేసుకునేందుకు ఆప్షన్ లేదు. సింగిల్ రేషన్ కార్డు దరఖాస్తుకు కేవలం 40-50 ఏళ్ల వయసున్నవారికే అవకాశం ఇచ్చారు. 50 ఏళ్లపైబడిన వారికి కుదరడం లేదు.

కొత్త జంటలకు చిక్కులే...

కొత్తగా పెళ్లి అయిన జంటలో ఒకర్ని కార్డులో చేర్చే సమయంలో కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. వివాహ ధ్రువపత్రాలు, పెళ్లికార్డులు, పెళ్లి ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే కొత్త సభ్యుడి చేర్పు దరఖాస్తు పూర్తి అవుతుందని లేదంటే అప్లోడ్ కావడం లేదని ఈ నెల 7వ తేదీ నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని చెబుతున్నప్పటికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయకపోవడంతో సాంకేతికంగా ఇబ్బంది అవుతోంది. గత రెండు వారాలుగా రిజిస్ట్రేషన్ లేని జంటలు రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

త్వరలో విలీన గ్రామాల సమస్య కొలిక్కి

నాదెండ్ల: చిలకలూరిపేట మున్సిపాలిటీలో గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామాల విలీన ప్రక్రియపై రెండు మూడు నెలల్లో పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ చెప్పారు. గణపవరం గ్రామాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ముందుగా గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించారు. దీనికి రూ.32 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. మూడు గ్రామాలు చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనంపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించినందున నిధులు విడుదల కావటం లేదని, వచ్చిన పన్నుల ఆదాయం జీత భత్యాలకే సరిపోతున్నట్లు పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు వివరణ ఇచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ రూ.32 లక్షల్లో మూడొంతులు జెడ్పీ నుంచి ఇస్తామని, మిగతా మండల పరిషత్ నుంచి విడుదల చేయాలని ఎంపీడీవో స్వరూపరాణిని ఆదేశించారు. మూడు గ్రామాల్లో సమస్యలను స్థానిక నాయకులు వివరించారు. మానుకొండవారిపాలెంలో వాటర్ ట్యాంక్ కూలే స్థితిలో ఉందని చెప్పగా, నూతన ట్యాంక్ నిర్మాణానికి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విలీన గ్రామాలను పంచాయతీలుగా చేసేందుకు తాను ప్రభుత్వానికి సిఫార్సు చేశానని, రెండు మూడు నెలల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. విలీనం వల్ల ఉపాధి హామీ పథకం అమలు కావడం లేదని స్థానికులు తెలిపారు. రేషన్‌కార్డుల జారీ తదితరాల్లోనూ ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. గణపవరం పంచాయతీలో ఆరుగురు సిబ్బందికి తొమ్మిది నెలలుగా వేతనాలు రావటం లేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు జీతాలు వస్తాయని కమిషనర్ అన్నారు. రోడ్డుకు సొంత భూమి పోతున్నందున పరిహారం ఇప్పించాలని శివకుమారి అనే మహిళ కోరగా, ఆ మేరకు పంచాయతీ అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగేశ్వరనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజ్, డీఈ హరినాథబాబు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, కౌన్సిలర్లు గంగా శ్రీనివాసరావు, జాలాది సుబ్బారావు, పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంకు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామ వాస్తవ్యుడు పానుగంటి జయ నటరాజ్‌కుమార్, లక్ష్మీదివ్య దంపతుల కుమారుడు షత్విక్ జయదేవ్ పేరున రూ.1,00,001 విరాళంగా శుక్రవారం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందించారు. దాతలు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నేడు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్

నరసరావుపేట: ప్రతి నెలా నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఆర్టీసీ స్థలాల అద్దె వ్యవహారంపై సమావేశం



నరసరావుపేట: సత్తెనపల్లి, నరసరావుపేట, పిడుగురాళ్లలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15 ఏళ్లపాటు చట్టపరమైన వ్యాపారం చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో శుక్రవారం ఆర్టీసీ డిపోలోని ప్రజా జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నెల్లూరు జోనల్ కార్యాలయం ద్వారా టెండర్లు పిలవనున్నారని పీటీడీ జిల్లా అధికారి ఎం.మధు పేర్కొన్నారు. ఇవ్వబోయే స్థలాలను గురించి పారిశ్రామిక వేత్తలతో చర్చించారు.

వైభవంగా ఆంజనేయుని రథోత్సవం

వేమూరు: మండలంలోని జంపని గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల హనుమ నామస్మరణ, మేళతాళాల మధ్య వేడుక సాగింది. కోలాటం, భజనల నడుమ రథోత్సవం జరిగింది. భక్తులు షేక్ అబ్దుల్ కలాం ఆజాద్ దంపతులు వార్షిక పూజాకర్తలుగా వ్యవహరించారు. పెరుమాళ్ల వెంకట సుబ్బయ్య, పెరుమాళ్ళ రామయ్య నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గొంది శివరామ కృష్ణ ప్రసాద్, మన్నే శివ వెంకటేశ్వర రావులు ప్రసాద పంపిణీ చేశారు. ఆంజనేయ భక్త బృందం, సీతారామాంజనేయ భజన సమాజం, ఆంజనేయ యువజన భక్త సమాజం, వీరాంజనేయ కోలాట భజన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

నేడు సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: సరస్వతి పుష్కరాలు పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు-2 డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం ఎం.రవికాంత్ శనివారం తెలిపారు. 12 సంవత్సరాలకొకసారి వచ్చే పుష్కరాలకు సంబంధించి ఈ నెల 24న గుంటూరు-2 డిపో నుంచి బస్సు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. యాత్ర మొత్తం మూడు రోజులు ఉంటుందని, 24వ తేదీ రాత్రి 10 గంటలకు బయల్దేరి, రెండో రోజు కాళేశ్వరం చేరుతుందన్నారు. అక్కడ పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన తరువాత రామప్ప దేవాలయం, వరంగల్ భద్రకాళి దేవాలయం, వెయ్యి స్థంభాల గుడి దర్శించడం జరుగుతుందన్నారు. మూడో రోజున కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని దర్శించి, అనంతరం వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరి స్వామి వారిని దర్శించుకుని గుంటూరు తిరుగు ప్రయాణం అవుతుందన్నారు. ఈ సర్వీసుకు సంబంధించి ఆన్‌లైన్‌లో 96163 నంబరు ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.2,420 టికెటు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర ఖర్చులు సొంతంగా చూసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 73828 97459, 73828 96403 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎగసి పడుతున్న అలలు

- నిర్మానుష్యంగా మారిన సముద్ర తీరం
- వేట లేక అల్లాడుతున్న మత్స్యకారులు

బాపట్ల: వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా మూడు రోజులుగా సముద్రతీరం నిర్మానుష్యంగా మారింది. మరోపక్కన అలలు ఎగసి పడుతున్నాయి. ఆకాశం మేఘావృతం కావటంతోపాటు సాయంత్రానికి చిమ్మచీకట్లు కమ్ముకొంటున్నాయి. ఈదురుగాలులు ఎక్కువగా రావటంతోపాటు రాకాసి అలలు ఎగిసి పడుతుండటంతో తీరానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. తీరం ఇంత నిర్మానుష్యంగా మారటం ఇటీవల కాలంలో ఎప్పుడు చూడలేదని స్థానికులు చెబుతున్నారు.

కరువుభత్యం అంతంత మాత్రమే

సముద్రం వేట నిషేధం సందర్భంగా 45 రోజులపాటు ప్రభుత్వం కరువుభత్యం ఇస్తోంది. బాపట్ల జిల్లాలో 5 వేల మందికిపైగానే మత్స్యకారులు ఉన్నప్పటికీ సగం మందికి కూడా అందలేదు. ఈ ఏడాది కూడా ఆకలి కేకలు తప్పటం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న బీచ్

నిలిచిన వేట

గత నెల రోజులుగా వేట నిషేధం కావటం, మరో వారంలో ఎత్తివేసేందుకు అవకాశం ఉండగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇప్పటికీ అనుమతి రాలేదు. వేట మినహా మిగిలిన ఉపాధి అవకాశాలు కూడా లేకపోవటంతో సముద్రానికి దగ్గరగా ఉన్న రామ్‌నగర్ పెద్దకాలువలో మత్స్యకారులు చేపలు పడుతూ పొట్ట నింపుకొంటున్నారు.

చిరు వ్యాపారులలో అలజడి

వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా సూర్యలంకకు పర్యాటకులు సంఖ్య తగ్గిపోవటంతో తీరంలోని చిరు వ్యాపారులు కనీసం బోణీలు కూడా లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం రోజుకు 50 మంది పర్యాటకులు కూడా రాకపోవటంతో ఆవేదన చెందుతున్నారు.

ఎండీయూ ఆపరేటర్ల ధర్నా

- వాహనాలను భేషరతుగా కొనసాగించాలని డిమాండ్
- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఆపరేటర్లు, హెల్పర్లు



కలెక్టరేట్ ఎదుట తమ వినతిపత్రంతో ధర్నా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు

నరసరావుపేట: రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే బియ్యం, ఇతర నిత్యావసరాలను అందిస్తున్న ఎండీయూ వ్యవస్థను భేషరతుగా కొనసాగించాలని ఏపీ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలోని ఆపరేటర్లు, హెల్పర్లు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద తమ వాహనాలతో ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేసీ సూరజ్ గనోరేకు అందజేశారు. తమ సేవలను కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తీరా అధికారంలోకి రాగానే 18,500 మందిని, తమతోపాటు మరికొందరిని జాబ్ నుంచి తీసేసే పనిలో ప్రభుత్వం ఉండటం శోచనీయమన్నారు. విజయవాడ వరదల్లో చేసిన సేవలను సీఎం చంద్రబాబు కూడా మెచ్చుకున్నారన్నారు. అటువంటి వ్యవస్థను ఏవిధంగా తీసేస్తారని ప్రశ్నించారు. 2027 వరకు తమకు ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉందన్నారు. దానిని గౌరవించి, దీనిపై అధ్యయనం చేసి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిబద్ధతతో పనిచేస్తున్న ఎండీయూ వ్యవస్థను తొలగించటం చాలా బాధాకరమన్నారు. తమకు న్యాయం చేసేలా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. ధర్నాలో జిల్లాలోని హెల్పర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో క్రీడా రత్నం

- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్న నాగం జ్ఞానదివ్య
- సొంతూరు కఠెవరంలో సాధన
- ప్రభుత్వ పాఠశాల పీఈటీచే శిక్షణ
- కామన్‌వెల్త్ పోటీల్లోనూ ఆరు పతకాలు

తెనాలి: గ్రామాల్లోనూ ఆ సౌకర్యాలు ఏర్పాటైతే అక్కడ నుంచి కూడా క్రీడారత్నాలు వెలుగులోకి వస్తాయి. పట్టణ యువతతో పోటీపడి విజయాలు సాధిస్తారు. ఇటీవల ఆసియా క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్, యూనివర్సిటీ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో మొత్తం 8 పతకాలను సాధించిన పవర్‌లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య ఇందుకో నిదర్శనం.

ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియా క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్‌లో రెండు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్న జ్ఞానదివ్య, యూనివర్సిటీ క్లాసిక్ పోటీల్లో నాలుగు స్వర్ణ పతకాలను సాధించింది. ఆసియా సెకండ్ బెస్ట్ లిఫ్టర్ అవార్డును స్వీకరించింది. 2021లో పవర్‌లిఫ్టింగ్‌లో సాధన ఆరంభించిన జ్ఞానదివ్య రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో వరుసగా పాల్గొంటూ అవలీలగా పతకాలను సాధిస్తోంది. కామన్ వెల్త్, వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ పాల్గొని విజయాలను అందుకుంటున్న జ్ఞానదివ్య గ్రామీణ ప్రాంత క్రీడారత్నం. ప్రస్తుతం కేఎల్ యూనివర్సిటీలో బీసీఏ సెకండియర్ పూర్తిచేసింది.



ఆసియా పోటీల్లో సాధించిన పతకాలు, జ్ఞాపికలతో జ్ఞానదివ్య

కాకతాళీయంగా సాధన

తెనాలి రూరల్ మండలం గ్రామం కఠెవరం ఆమె సొంతూరు. సుధారాణి, వెంకటేశ్వరరావు తల్లిదండ్రులు. పవర్‌లిఫ్టింగ్‌లో సాధన కాకతాళీయంగా జరిగింది. ఇంటర్మీడియెట్ చదువుతుండగా గ్రామంలో మాతృశ్రీ అకాడెమీ ఏర్పాటైంది. వాస్తవానికి కఠెవరం గ్రామం ఒకప్పుడు అథ్లెటిక్స్‌కు కేంద్రం, ఇక్కడ్నుంచి తయారైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తలపడ్డారు. గ్రామం నుంచి వెయిట్‌లిఫ్టర్లను తయారు చేయాలనే సంకల్పంతో ఇక్కడ అకాడమీ ఏర్పాటైంది. క్రీడాభిలాష కలిగిన వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో జ్ఞానదివ్య అకాడమీలో చేరింది. వెంకటేశ్వరరావు, వలి, సుధాకర్, రామిరెడ్డి, వీరారెడ్డి శిక్షణతో వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణ ఆరంభించింది. కొద్దిరోజుల తర్వాత పవర్‌లిఫ్టింగ్‌కు మారింది. నందివెలుగు జడ్పీ హైస్కూలు పీఈటీ కొల్లిపర నాగశిరీష శిక్షణలో క్రమం తప్పక సాధన చేస్తూ, 2021 ఆఖర్నుంచి పోటీల్లో పాల్గొంటూ వచ్చింది. సబ్‌జూనియర్స్‌లో 84 పైగా కిలోల కేటగిరీలో తలపడుతున్న జ్ఞానదివ్య, కేవలం తొమ్మిది నెలల వ్యవధిలో రాష్ట్ర, జాతీయస్థాయిలో మూడేసి స్వర్ణాలు, దక్షిణభారత పోటీల్లో రజత పతకాన్ని గెలిచింది. ఏ పోటీలో తలపడినా పతకం మాత్రం ఖాయమంటున్నట్లుగా జ్ఞానదివ్య సత్తా చాటుతోంది.

మద్యం దుకాణాలు సమయపాలన పాటించాల్సిందే

- వైన్ షాపులు రాత్రి 10 గంటలకు మూసేలా ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షణ
- అనధికార పర్మిట్ రూమ్‌లు నిర్వహించే వారిపై కఠిన చర్యలు
- ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని బార్ అండ్ రెస్టారెంట్‌లు, వైన్ షాపులు తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిందేనని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని మద్యం షాపులు రాత్రి 10 గంటలకు కచ్చితంగా మూసేయాల్సిందేనన్నారు. 10 గంటలకు వైన్ షాపులను మూసేలా ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. పర్మిట్ రూముల నిర్వహణకు అనుమతి లేదని, ఎవరైనా పర్మిట్ రూముల్లో మద్యం తాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లకు కూడా రాత్రి 11 గంటల వరకు లిక్కర్ సరఫరా, ఆ తరువాత గంట వరకు ఫుడ్ సరఫరాకు అనుమతి ఉందని చెప్పారు. అనంతరం తప్పనిసరిగా మూసివేయాల్సిందేనన్నారు. సమయపాలనపై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక బృందాలు నిత్యం పర్యవేక్షణ చేస్తాయని తెలిపారు. వీరిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే షాపుల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,900 కేసులు నమోదు చేసి 1,201 మందిని అరెస్టు చేశామన్నారు. ఇందులో మద్యం 2,297 లీటర్లు, బీరు 119 లీటర్లు, నాటు సారా 444 లీటర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి 2.89 గ్రాములు, కొకైన్ 8.5 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మొత్తం 21 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇ. మారయ్యబాబు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.శ్రీనివాస్

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

యడ్లపాడు: బాలికపై లైంగిక దాడి ఘటనలో పోక్సో కేసు నమోదైన యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం హౌస్ గణేష్‌పాడు గ్రామ నివాసి అల్ల కొండలు, మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికను ఆసక్తికరమైన మాటలతో ఆకర్షించాడు. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గత నెల 15న జరిగింది. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నరసరావుపేట డీఎస్పీ పర్యవేక్షణలో విచారణ చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో పాటు వాంగ్మూలాలు సేకరించారు. నిందితుడిని ఈ నెల 22న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలోని హైవే వంతెన వద్ద పట్టుకున్నారు. చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరు పరుచగా, జూన్ 5వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు యడ్లపాడు ఎస్ఐ టి. శివరామకృష్ణ తెలిపారు.

లారీ ఢీకొని బాలుడి మృతి



తాడికొండ: లారీ ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం రాయపూడి గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తుళ్లూరు గ్రామానికి చెందిన అంకం అభి (12) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాయపూడి పెట్రోల్ బంక్ వద్ద వేగంగా వస్తున్న లారీని ఢీకొట్టింది. బాలుడిని ఈడ్చుకు వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 10 గంటల వరకు కూడా నిరసన ముగించక పోవడంతో పోలీసులు సర్ది చెప్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ వాహనం వదిలి పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నారు. అభి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. రాజధానిలో కూలీ పనులు లేకపోవడంతో గేదెలు మేపుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడి అకాల మరణంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

శోకసంద్రంలో స్టూవర్టుపురం

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత
- లారీ కిందకు సగం దూసుకెళ్లిన కారు
- సీట్లలో ఇరుక్కుపోయిన మృతదేహాలు
- అరగంట సేపు శ్రమించి వెలికితీత
- డ్రైవర్ అతి వేగమే దుర్ఘటనకు కారణం
- వైరల్ అవుతున్న సీసీ కెమెరా ఫుటేజ్
- మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు
- స్టూవర్టుపురంలో విషాదఛాయలు



జేసీబీ సహాయంతో కారును వెనక్కు లాగిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్/కొమరోలు: ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అమరావతి – అనంతపురం జాతీయ రహదారిపై కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటు సమీపంలో హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ కర్రెద్దుల దివాకర్ కారును అతివేగంగా నడపడంతో ఈ దుర్ఘటన జరిగింది. లారీని ఢీకొట్టిన తర్వాత కారు సగభాగం వరకు లారీ కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ముందు సీట్లలో కూర్చున్న డ్రైవర్ దివాకర్, పక్క సీటులో ఉన్న బొచ్చు సన్నీ మృతదేహాలు ఇరుక్కుపోయాయి. బయటకు తీసేందుకు జేసీబీ సహాయంతో అరగంటపాటు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. కారు వేగంగా వచ్చి లారీని ఢీకొట్టడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించినట్లు పెట్రోలు బంకులో ఉన్న వ్యక్తులు తెలిపారు. పెట్రోలు బంకులోని సీసీ కెమెరాలో ఈ ప్రమాదం రికార్డయింది. ఆ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కారులో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో స్టూవర్టుపురం గ్రామం, న్యూ గ్యాంగ్‌కు చెందిన గజ్జల నరసింహ (23), గజ్జల అంకాలు (45), పెద్ద గ్యాంగ్‌కు చెందిన గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు (25), కర్రెద్దుల దివాకర్(24),లారో గ్యాంగ్‌కు చెందిన బొచ్చు సన్నీ (27), 1వ గ్యాంగ్‌కు చెందిన



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

మొగిలి చిన్న భవాని (23) మృతి చెందారు. భవాని కుమారుడు సిద్దు, కుమార్తె సిరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.
కుటుంబ కలహాలపై చర్చించేందుకు నంద్యాల జిల్లా డోన్‌లోని తమ బంధువుల ఇంటికి కారు ఆరుగురు వెళ్లారు. అక్కడ చర్చల అనంతరం మహానంది పుణ్యక్షేత్రాన్ని సందర్శించుకున్నారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

ఎటు చూసినా విషాదమే

బాపట్ల టౌన్: వ్యక్తిగత పనులపై డోన్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఆరుగురు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటనతో స్టూవర్టుపురం శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు ఒకేసారి మృత్యువు ఒడిలోకి జారుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఏ ఒక్కరిని పలకరించిన కన్నీరే సమాధానమైంది. గురువారం మధ్యాహ్నం చీరాల మండలం, తోటవారిపాలెం గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో గజ్జల నరసింహ కుమారుడికి అన్నప్రాసన జరిగింది. బాపట్ల జిల్లా, బాపట్ల మండలం, స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, ఇద్దరు చిన్నారులు కారులో వెళ్లారు. అనంతరం శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వ్యక్తిగత పనులపై ఉమ్మడి కర్నూలు జిల్లా, ప్రస్తుత నంద్యాల జిల్లాలోని డోన్‌కు వెళ్లారు. కారులో తిరిగొస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, తాటిచెర్లమోటు గ్రామ సమీపంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. విషయం తెలిసిన మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు సైతం విషాదంలో మునిగిపోయారు.



మృతుడు కర్రెద్దుల దివాకర్



మృతుడు గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు



మృతుడు బొచ్చు సన్నీ



మృతురాలు గజ్జల అంకాలు



మృతుడు గజ్జల నరసింహ

కుటుంబంలో పెను విషాదం

గజ్జల అంకాలు, ఆమె కుమారుడు గజ్జల నరసింహ, కుమార్తె మొగిలి భవాని ఒకే సారి మృతి చెందడంలో కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. అంకాలు భర్త జనార్దన్ ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం. ప్రస్తుతం అంకాలు సహా వారి కుమారుడు నరసింహ, కుమార్తె భవానీ కూడా మృతి చెందారు. కుటుంబంలో కేవలం అంకాలు పెద్ద కుమారుడు వాసు మాత్రమే మిగిలారు. కుటుంబం మొత్తాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించిందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



విలపిస్తున్న నరసింహ భార్య జాబిల్లిని ఓదారుస్తున్న కుటుంబసభ్యులు

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

చిన్ననాటి నుంచి కలిసి తిరిగారు. ఎక్కడికైనా ఆ నలుగురు స్నేహితులు కలిసే వెళ్తారు. కుటుంబాలు వేరైనా ఓ తల్లి పిల్లల్లా కలిసి మెలసి తిరుగుతుంటారు. అలాంటి వీరి స్నేహాన్ని విధి వెక్కిరించింది. రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు వీరిని కబళించింది. ప్రాణ స్నేహితుల్ని విగత జీవులుగా మార్చింది. నాలుగు కుటుంబాలకు కడుపుకోత మిగిల్చింది. వీరిలో గజ్జల నరసింహకు మాత్రమే వివాహమైంది. గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు ఆటోడ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవర దివాకర్, బొచ్చు సన్నీలకు వివాహం కాలేదు. వీరి కుటుంబాలకు వీరే మగదిక్కు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

జనసేన నాయకుడిపై దాడి హేయం

సత్తెనపల్లి: జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై దాడి హేయమైన చర్య అని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి ఖండించారు. దాడిలో గాయపడి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న కొమ్మిశెట్టి వెంకటసాంబశివరావును శుక్రవారం ఆయన పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన జనసేన నాయకుడుపై దాడి చేయడం దారుణమని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించాలని కోరారు. ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒకవైపు న్యాయవాదులపై దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టాలు తెస్తున్నామని చెబుతూ మరో వైపు ప్రోత్సహించడం పాలకులకు సరికాదని తెలిపారు.న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై భౌతిక దాడిని తీవ్రంగా ఖండించారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ మృతి

కాకుమాను: రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పెదనందిపాడు ఎస్ఐ పవన్ మధు కథనం ప్రకారం బాపట్ల జిల్లాలో కీర్తి వెంకటరాజు ఇంటెలిజెన్స్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అయితే తన స్నేహితుడు గుప్తాతో కలిసి గుంటూరు వెళ్లి తిరుగు ప్రయాణంలో పెదనందిపాడు శివారులో కారు చెట్టుని బలంగా ఢీ కొట్టడంతో వెంకటరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కారులో ఉన్న తన స్నేహితుడికి బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. డ్రైవర్‌కు ఒక కాలు విరగడంతో పాటు స్వల్ప గాయాలైనట్లు ఆయన తెలిపారు. వెంకటరాజు మృతదేహాన్ని చీరాల తరలించినట్లు ఎస్ఐ పవన్ మధు తెలిపారు.




ప్రమాదంలో ధ్వంసమైన కారు

కళల పండుగకు వేళాయె !

- నేటి నుంచి 40వ జాతీయ సంగీత, నాట్య, కళారూపాల పోటీలు
- కళా నిలయం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహణ
- వేదికగా వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపం

చిలకలూరిపేట: కళా రంగంలో చిలకలూరిపేట కీర్తిని దేశ నలుమూలలా వ్యాప్తి చేసిన ఘనత స్థానిక కళా నిలయం సంస్థకు చెందుతుంది. కళలను ప్రోత్సహించండి – కళాకారులను ఆశీర్వదించండి అంటూ సంస్థను కళా నిలయం అధ్యక్షుడు ప్రగడ రాజమోహనరావు ప్రారంభించారు. కళాభిమానులైన దాతల సహకారంతో ఏటా సంగీత, నాట్య, కళారూపాల పోటీలు నిర్వహిస్తున్నారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా కళలను బతికిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్న ఘనత రాజమోహనరావుకే దక్కుతుంది. కళలంటే ఆయనకు ప్రాణం..కళాకారులంటే అభిమానం. అందుకే 1984లో కళా నిలయాన్ని స్థాపించి కళామ తల్లికి సేవలందిస్తున్నారు. తీవ్ర అనారోగ్య పరిస్థితులు వెంటాడుతున్నా, ఆర్థిక పరిస్థితులు సహకరించకున్నా, దాతలే హితులై అందిస్తున్న సహకారంతో నృత్య, సంగీత, కళా రూపాల పోటీలను క్రమం



కళా నిలయం చిహ్నం

తప్పకుండా నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీలు శనివారం నుంచి ప్రారంభమై 25వ తేదీ వరకు నిర్విరామంగా పగలు, రాత్రి మూడు రోజులపాటు కొనసాగుతాయి.

సంప్రదాయ కళలకు ఊతం

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపం ఈ పోటీలకు వేదిక కానుంది. పాశ్చాత్య నృత్య, సంగీత హోరులో ఆదరణ కోల్పోతున్న భారతీయ సంప్రదాయ కళలకు ఊతమిచ్చేందుకు ప్రస్తుత తరుణంలో కళా నిలయం వేదికగా నిలుస్తోంది. ఉత్సవంలో పలు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కళాకారులు పాల్గొంటారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయలను తమ అద్భుత కళారూపాల ద్వారా భావితరాలకు అందించే ప్రయత్నం చేయడం విశేషం. భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు, నృత్య నాటికల పోటీలతో పాటు జానపద, సినీ గేయాల పోటీలను కళానిలయం వేదికగా నిర్వహించడం విశేషం.

కళాకారులతో కళకళలాడనున్న వేదిక



ప్రగడ రాజమోహనరావు.

కళా నిలయం 40వ జాతీయ నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 400 మంది పైగా కళాకారులు తరలిరానున్నారు. సూర్య, చంద్ర విభాగాల పేరిట రెండు గ్రూపులుగా పోటీలను నిర్వహిస్తారు. కూచిపూడి, భరత నాట్యంతో పాటు శాస్త్రీయ బృంద నాట్యాలు, సినీ మధుర గీతాలు, యుగళ గీతాలు, నృత్య నాటికలు, శాస్త్రీయం కాని బృంద నాట్యాలు, నృత్య నాటికల పోటీలు ఉంటాయి.

వృద్ధులకు శుభవార్త!

- సీనియర్ సిటిజన్ కార్డు దరఖాస్తులకు ఆహ్వానం
- గ్రామ సచివాలయంలోనే చేసుకునే అవకాశం
- రెండు రోజుల్లోనే పొందేలా చర్యలు
- కార్డు ద్వారా పలు ప్రయోజనాలు



అధికారులు జారీ చేసిన సీనియర్ సిటిజన్ కార్డు

యడ్లపాడు: కేంద్ర ప్రభుత్వం 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రత్యేకంగా 'సీనియర్ సిటిజన్ కార్డు'లను జారీ చేయాలని నిర్ణయించింది. వీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ సేవకోసం దూరంగా వెళ్లాల్సిన అవసరం లేదు. గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు ప్రక్రియ కూడా చాలా సులభం. ఆధార్, వయసును నిర్ధారించే గుర్తింపు పత్రం, బ్లడ్‌గ్రూప్ వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు రూ. 40 చెల్లిస్తే రెండు రోజుల్లోనే కార్డును అందజేస్తారు. అయితే ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి.

ఇవి ప్రయోజనాలు

ఈ కార్డుతో వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు రకాల ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో 25శాతం రాయితీ, ప్రత్యేక సీట్లు, రైల్వే స్టేషన్లలో కౌంటర్ల వద్ద ప్రాధాన్యత, వరుసలో నిలబడి ఉండాల్సిన అవసరం ఉండదు. బ్యాంకుల్లో ఫిక్సడ్ డిపాజిట్లపై అధిక వడ్డీ, ఆదాయపు పన్ను మినహాయింపు కోసం, పాస్‌పోర్ట్ ఫీజులో తగ్గింపు వంటి లాభాలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్‌కార్డ్, వయో వందన హెల్త్ కార్డు పొందడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల కేటాయింపులతో పాటు కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రాయితీపై ఆరోగ్య సేవలు లభించనున్నాయి. ఇంకా దేవాలయాలలో ప్రాధాన్యత దర్శనం పొందడానికి ఈ కార్డు దోహదం కానుంది.

25వేల మందికి జారీ

గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో ఈ ఏడాది మార్చి వరకు ఆఫ్‌లైన్‌లో 26,575 దరఖాస్తులను సీనియర్ సిటిజన్స్ సమర్పించారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ప్రక్రియను ఆన్‌లైన్ చేయడంతో 1438 మంది నేరుగా దరఖాస్తు చేసుకున్నారు. ఆయా అర్జీలను పరిశీలించి 25వేల మందికి పైగా కార్డులను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు, పల్నాడు జిల్లాలో సుమారు 9 లక్షల మంది 60 ఏళ్లు దాటిన వారు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. ఇప్పటి వరకు దరఖాస్తు వారిలో అర్హులైన వారందరికీ సీనియర్ సిటిజన్ కార్డులను ఎప్పటికప్పుడు జారీ చేస్తున్నాం. ఎన్టీఆర్ పెన్షనర్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షనర్లతో పాటు వృద్ధులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్. సువార్త,
ఏడీ, వయో వృద్ధుల సంక్షేమ శాఖ

క్రీడా స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

వెల్దుర్తి: క్రీడా స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. శిరిగిరిపాడులోని వీరాంజనేయస్వామి తిరునాళ్ల పురస్కరించుకొని గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన పురుషులు, మహిళా వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు శుక్రవారం ఆయన బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో లక్ష్యాలు ఏర్పరచుకొని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఫైనల్ విజేతలుగా నిలిచిన ఎస్ఆర్ఎం పురుషుల జట్టుకు రూ.లక్ష , మెడల్స్, ట్రోఫీలను అందించారు. ఎస్ఆర్ఎం మహిళా విభాగం జట్టుకు రూ.లక్ష, ట్రోఫీ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఐటీబీ పురుషుల జట్టు, సదరన్ రైల్వే మహిళా జట్టుకు రూ.75 వేలు, మెడల్స్, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో వెల్దుర్తి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

బదిలీల దరఖాస్తులో జాగ్రత్తలు అవసరం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు దరఖాస్తు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు సూచించారు. ఉపాధ్యాయుల బదిలీలపై శుక్రవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసే సమయంలో సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకరావాలని తెలిపారు. ప్రభుత్వం దాదాపు 770 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయటం మంచి పరిణామమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచటంలోనూ, విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచటంలోనూ యూటీఎఫ్ కార్యకర్తలు ముందుండాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు ప్రభుత్వ ఉత్తర్వులు, దరఖాస్తు పూరించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, గౌరవాధ్యక్షుడు షేక్ ఖాసీం పీరా, సహాధ్యక్షురాలు ఏ.భాగేశ్వరిదేవి పాల్గొన్నారు.